

రాయపర్తి: బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి ఎడ్లబండ్ల ర్యాలీలో పాల్గొన్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

## రైతుల బాధలు తెలిపేందుకే ఎడ్లబండ్ల ర్యాలీ

- రజతోత్సవ సభకు స్వచ్ఛందంగా తరలిరావాలి
- కేసీఆర్ పదేండ్ల పాలన అన్నదాతలకు స్వర్ణయుగం
- కాంగ్రెస్ సర్కార్ అనతి కాలంలోనే కూలడం ఖాయం
- రాష్ట్ర మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- రాయపర్తిలో ఎడ్లబండ్ల ర్యాలీకి ఎదురేగి స్వాగతం

రాయపర్తి, ఏప్రిల్ 24: కాంగ్రెస్ పాలనలో రైతుల బాధలు ఉద్యమ రథసారథి, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌తో పాటు రాష్ట్రంలోని సబ్బండ వర్గాల దృష్టికి తీసుకురావాలనే సూర్యాపేట జిల్లా నెమ్మికల్ నుంచి 16 ఎండ్లబండ్లతో అన్నదాతలు బీఆర్ఎస్ రజతోత్సవ సభకు తరలివస్తున్నారని రాష్ట్ర మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తెలిపారు. గురువారం ఉదయం రాయపర్తి మండల కేంద్రానికి చేరుకున్న 'బండెనుక బండి కట్టి.. 16 బండ్ల ర్యాలీ'కి స్థానిక బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి ఆయన ఎదురేగి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి స్వయంగా ఎడ్లబండిని నడుపుకుంటూ మండల కేంద్రంలోని వరంగల్–ఖమ్మం జాతీయ రహదారి మీదుగా పార్టీ మండల కార్యాలయం వరకు ప్రజా చైతన్య ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 17నెలల రేవంత్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలోని రైతులు అష్టకష్టాలు పడుతున్నట్లు తెలిపారు. సమృద్ధిగా సాగు నీరు రాక, అప్రకటిత విద్యుత్ కోతలతో చేతికొచ్చే దశలో ఉన్న పంటలు కండ్ల ముందే ఎండిపోతుంటే కర్షకలోకం కన్నీరు పెట్టుకున్నదన్నారు. కేసీఆర్ పదేండ్ల పాలన రైతులకు స్వర్ణయుగమన్నారు. ప్రజలను అరిగోస పెడుతున్న రాష్ట్ర ప్రభుత్వం అనతి కాలంలోనే కూలిపోవడం ఖామయని జోస్యం చెప్పారు. ఈ నెల 27న హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు మండలంలోని అన్ని గ్రామాల నుంచి గులాబీ శ్రేణులు, కేసీఆర్ అభిమానులు, తెలంగాణవాదులు, మహిళలు, విద్యార్థులు, అన్నదాతలు, రైతు కూలీలు పెద్ద సంఖ్యలో స్వచ్ఛందంగా తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. అనంతరం ఎడ్లబండ్లు వర్ధన్నపేట వైపు సాగిపోయాయి. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల నాయకులు రంగుకుమార్, పూస మధు, గారె నర్సయ్య, లేతాకుల రంగారెడ్డి, ఎలమంచ శ్రీనివాస్‌రెడ్డి, పరుపాటి రవీందర్ రెడ్డి, మహ్మద్ అక్బర్, అశ్రఫ్‌పాష, రాం చందర్, సుధాకర్, చందు రామ్‌యాదవ్, సింహాద్రి, మధు, ఎల్లస్వామి, చిన్నాల ఉప్పలయ్య, గారె నరేశ్, మామిండ్ల అశోక్‌కుమార్, పాపిడికాయల రాజు, బల్లెం యాదగిరి పాల్గొన్నారు. కొలన్‌పల్లికి చెందిన వాసం సత్తమ్మ గురువారం అనారోగ్యంతో మృతి చెందగా, ఎర్రబెల్లి వెళ్లి నివాళులర్పించారు.



రజతోత్సవ సభా వేదిక పైనుంచి ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, పక్కన ఎమ్మెల్సీలు పోచంపల్లి, తక్కళ్లపల్లి, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలమల్లు, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ తదితరులు

- 16 నెలల పాలనలో 16 పనులు చేయలేదు
- మహిళలకు ఇచ్చిన హామీలు తుంగలో తొక్కారు
- చుక్క రక్తం చిందకుండా రాష్ట్రం సాధించిన ధీరుడు కేసీఆర్
- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

కాంగ్రెస్ చేతిలో మోసపోయిన ప్రతి ఒక్కరూ సభకు రావాలి

# దేశ చరిత్రలో మైలురాయిగా రజతోత్సవం

ఎల్కతుర్తి, ఏప్రిల్ 24 : ఎల్కతుర్తిలో ఈ నెల 27న నిర్వహించే రజతోత్సవ సభ దేశ చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచిపోతుందని, ఇక్కడ చేస్తున్న ఏర్పాట్లు చాలా బాగున్నాయని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేతిలో మోసపోయిన ప్రతి ఒక్కరూ ఈ సభకు తరలిరావాలని ఆమె పిలుపునిచ్చారు. గురువారం ఎల్కతుర్తిలోని సభా ప్రాంగణంలో జరుగుతున్న ఏర్పాట్లను బీఆర్ఎస్ నేతలతో కలిసి పరిశీలించారు. పనుల పురోగతిపై ఆరా తీయడంతో పాటు మహిళలకు ప్రత్యేక బారికేడ్లు ఏర్పాటు చేయాలని నిర్వాహకులకు సూచించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కవిత మాట్లాడుతూ తెలంగాణ బాగుండాలని బీఆర్ఎస్, కేసీఆర్ అనుకుంటారని, బీజేపీ, కాంగ్రెస్ నాయకులు మాత్రం ఓట్లు బాగా రావాలని కోరుకుంటారని విమర్శించారు. ఆ రెండు పార్టీలు ప్రజల మధ్య చీలిక తీసుకొచ్చి ఓట్లు పొందే ప్రయత్నం చేస్తాయన్నారు. రజతోత్సవం ఎందుకు జరుపుకుంటున్నారని కొంత మంది వెకిలిమాటలు మాట్లాడుతున్నారని, కాంగ్రెస్ నాయకుల్లారా ఖబడ్దార్.. ప్రజలకు మీ నైజం తెలిసిపోయిందన్నారు. 16 నెలల పాలనలో 16 పనులు కూడా చేయలేదని మండిపడ్డారు. దేశానికి సేవ చేయడానికే టీఆర్ఎస్ బీఆర్ఎస్‌గా రూపాంతరం చెందిందన్నారు. కాంగ్రెస్ నాయకులు అవాకులు, చెవాకులు మాట్లాడితే చూస్తూ ఊరుకోబోమని, ఒళ్లు దగ్గర పెట్టుకోవాలని హెచ్చరించారు. కాళేశ్వరం ప్రాజెక్టు కట్టి రైతులు గుండెలపై చేయి వేసుకొని పడుకునే పరిస్థితిని కేసీఆర్ సృష్టిస్తే, దానిని ఎండబెట్టి లక్షలాది ఎకరాలను బీడుగా మార్చింది కాంగ్రెస్ ప్రభుత్వం కాదా? అని ప్రశ్నించారు. తెలంగాణ అస్తిత్వం కోసం 2001లో కేసీఆర్ పిడికిలి బిగించి ఉద్యమాన్ని మొదలు పెట్టినప్పుడు ఉత్పన్నమైన అన్ని అనుమానాలను పటాపంచలు చేశారని గుర్తు చేశారు. ఒక్క చుక్క రక్తం చిందకుండా రాష్ట్రం సాధించిన ధీరుడు కేసీఆర్ అని కొనియాడారు. ఎన్ని అవాంతరాలు ఎదురైనా గుండె ధైర్యంతో బీఆర్ఎస్‌ను, తెలంగాణను కాపాడుతూ వచ్చారన్నారు. రాజకీయ కుట్రలను ఛేదించి తెలంగాణ వాదాన్ని ప్రజల్లో నిలబెట్టారని, 36 పార్టీల మద్దతును కూడగట్టారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ చేయని నయవంచన లేదని, 2004లో తెలంగాణ ఇస్తామని మోసం చేసిందని, దాని ఫలితంగా 1400 మంది ఆత్మ బలిదానాలు చేసుకుంటే పదేళ్ల తర్వాత రాష్ట్రాన్ని ఇచ్చారన్నారు. బీఆర్ఎస్‌లోని మహిళా నాయకత్వాన్ని పటిష్టం చేసేందుకు కేసీఆర్ రోడ్ మ్యాప్ ఇచ్చారని చెప్పారు. మహిళా సాధికారతకు కేసీఆర్ బాటలు వేశారని, మున్సిపాలిటీలు, మార్కెట్ కమిటీల్లో వారికి రిజర్వేషన్లు కల్పించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ ఆడపిల్లల కోసం ప్రతి జిల్లాలో హాస్టల్‌తో కూడిన డిగ్రీ కాలేజీలు ఏర్పాటు చేశారని, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, కేసీఆర్ కిట్ వంటి పథకాలు అమలు చేశారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఇస్తామన్న నెలకు రూ. 2500, తులం బంగారం, విద్యార్థినులకు స్కూటీల జాడేదని ప్రశ్నించారు. తెలంగాణ ప్రజల విజయాన్ని ప్రపంచానికి చాటడానికే బీఆర్ఎస్ రజతోత్సవ సభ జరుపుతుందని కవిత పేర్కొన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్, ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గ్యాదరి బాలమల్లు, మాజీ ఎంపీ మాలోత్ కవిత, మాజీ ఎమ్మెల్యేలు వొడితెల సతీశ్‌కుమార్, సుంకె రవిశంకర్, నన్నపునేని నరేందర్, చంద్రావతి, రాష్ట్ర నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, వాసుదేవరెడ్డి, లలితాయాదవ్, మహిళా నాయకురాళ్లు రజినీ, శ్రీదేవి, రమాదేవి, చారులత, మాధవి, హర్షిణి, వసంత, మేకల స్వప్న, శ్రీపతి రమ, తంగెడ శాలిని, మునిగడప లావణ్య, రాజ్యలక్ష్మి, పావనిగౌడ్ పాల్గొన్నారు.




## జయశంకర్ సార్ లేకుండా తెలంగాణ లేదు

### రజతోత్సవ పాట సీడీ ఆవిష్కరణలో ఎమ్మెల్సీ కవిత



పాట సీడీ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ కవిత

హనుమకొండ, ఏప్రిల్ 24 : 'ఈ నెల 27న ఎల్కతుర్తిలో నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభ చరిత్రలో నిలుస్తుంది.. తెలంగాణ ప్రస్తావన వచ్చినప్పుడు ప్రొఫెసర్ జయశంకర్ ప్రస్తావన లేకుండా తెలంగాణ ఉండదు. ఓరుగల్లు గడ్డ నుంచి ఆ మహనీయుడిని తలుచుకోవడం మన అందరి బాధ్యత.. వారు తెలంగాణ భావజాలాన్ని బతికించి అందిస్తే.., ఆయన ఉద్యమ స్ఫూర్తిని కేసీఆర్ కొనసాగించి రాష్ట్రాన్ని సాధించి తన దక్షతను చాటుకున్నారు' అని ఎమ్మెల్సీ కవిత అన్నారు. బీఆర్ఎస్ రజతోత్సవ సభ సందర్భంగా ఏనుగుల రాకేశ్‌రెడ్డి రూపొందించిన 'ఎగిసెర బలే ఎగిసెర సారే రావాలంటూ ఓరుగల్లు పిలిచెర' అనే పాట సీడీ ఆవిష్కరణ హనుమకొండ సుబేదారిలోని ఎస్ఆర్ కన్వెన్షన్‌లో జరిగింది. ముఖ్య అతిథిగా ఆమె హాజరై పాట సీడీని ఆవిష్కరించారు. అలాగే రిటైర్డ్ తహసీల్దార్ మహమ్మద్ సిరాజుద్దీన్ రచించిన పాటను సైతం ఆవిష్కరించి ఇద్దరిని అభినందించారు. అనంతరం కవిత మాట్లాడుతూ.. బీఆర్ఎస్ 14 ఏళ్ల పోరాటం, 10 ఏళ్ల పాలనలో తెలంగాణ ఆత్మగౌరవాన్ని విలసిల్లేలా చేసి, దేశంలో నంబర్‌వన్ రాష్ట్రంగా తెలంగాణను నిలబెట్టిన ఘనత కేసీఆర్‌ది అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో మన తెలంగాణ యాసలో మాట్లాడితే హేళనగా చూసేవాళ్లని, కానీ, స్వరాష్ట్రం సిద్ధించిన తర్వాత 10 ఏళ్ల స్వపరిపాలనలో మన యాస, భాషకు ప్రాభవం పెరిగిందన్నారు. 2001లో కేసీఆర్ ఉద్యమం మొదలు పెట్టిన తర్వాత మన యాసను సగర్వంగా మైకుల ముందు మాట్లాడే పరిస్థితి వచ్చిందని తెలిపారు. దేశంలోనే బీఆర్ఎస్ పార్టీ చరిత్ర సృష్టించిందని, గత 25 ఏళ్లలో రెండు ప్రాంతీయ పార్టీలు మాత్రమే మనుగడలో ఉన్నాయని, అందులో ఒకటి టీడీపీ, ఇంకోటి బీఆర్ఎస్ అని, అలాంటి ఉద్యమ పార్టీ రజతోత్సవ సభ ఘనంగా నిర్వహించబోతున్నట్లు చెప్పారు. సభను విజయవంతం చేయడంకోసం సోదరుడు రాకేశ్‌రెడ్డి ముందుపడి గొప్పగా పాటను రూపొందించడం చాలా సంతోషమన్నారు. అనంతరం రాకేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. పాట తెలంగాణ ప్రజల ప్రాణం, పేద ప్రజల పేగు బంధం, వందల ప్రసంగాల సారాన్ని ఒక్క పాట చెబుతుందన్నారు. ఈ పాట గిరిజనుల దరువు నుంచి, హరిజనుల దండోరా నుంచి, గొల్ల కురుమల డోలు నుంచి, ఢమరుకం నుంచి, ఆడబిడ్డల మువ్వల సవ్వడి నుంచి, కాలే కడుపుతో వంగి నాట్లేస్తున్న తల్లి పొత్తిళ్ల నుంచి పుట్టిందన్నారు. అందుకే ఈ తెలంగాణ గడ్డ మీద పుట్టిన పాటలో పౌరుషం తొణికిసలాడుతుందన్నారు. తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్ ఒక యుద్ధ నౌక అయితే వారి తూటాల్లాంటి మాటలు వలస దోపిడీదారులపై పేలిన ఫిరంగులని అన్నారు. బీఆర్ఎస్ రజతోత్సవ సభకు ఈ పాటను అంకితం ఇవ్వాలని రూపొందినట్లు తెలిపారు. కార్యక్రమంలో భారత జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాస్యం విజయ్‌భాస్కర్, రజనీసాయిచంద్, గాయకుడు మానుకోట ప్రసాద్, పద్మశ్రీ అవార్డు గ్రహీత గడ్డం సమ్మయ్య, సిరికొండ ప్రశాంత్, కవి ఎండీ సిరాజొద్దీన్ పాల్గొన్నారు.

### ఎమ్మెల్సీ పోచంపల్లితో కలిసి సభ ఏర్పాట్ల పరిశీలన



సభ ఏర్పాట్లపై ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డితో మాట్లాడుతున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

## పనుల పురోగతిపై జగదీశ్‌రెడ్డి ఆరా

ఎల్కతుర్తి, ఏప్రిల్ 24 : హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో ఈ నెల 27న జరుగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభ ఏర్పాట్లను గురువారం సాయంత్రం మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి పరిశీలించారు. పనుల పురోగతిపై వారు ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. సభావేదిక, హెలిప్యాడ్, తమ నియోజకవర్గాలకు కేటాయించిన పార్కింగ్ స్థలాలను పరిశీలించారు. తమ ప్రాంతాల నుంచి ప్రజలు ముందుగానే సభా వేదికకు వచ్చేలా చూస్తామని వారు చెప్పారు. రజతోత్సవ బహిరంగ సభ గతంలో జరిగిన సభల కంటే చరిత్రలో నిలిచిపోతుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

## సభకు ఉప్పెనలా కదిలిరావాలి..

జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

బచ్చన్నపేట, ఏప్రిల్ 24 : బీఆర్ఎస్ రజతోత్సవ సభకు ఉప్పెనలా కదిలి రావాలని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం ఆయన మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్ సభకు మండలం నుంచి పెద్దఎత్తున కార్యకర్తలు, నాయకులు, ముఖ్య కార్యకర్తలు తరలిరావాలన్నారు. పార్టీ ఆధ్వర్యంలో బస్సులు, ఇతర వాహనాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా, రైతు వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించాలన్నారు. సభకు వచ్చే ముందు ప్రతి గ్రామంలో గులాబీ జెండాలను ఆవిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ పూర్ణచందర్, వైస్‌చైర్‌పర్సన్ మద్దికుంట రాధ, మాజీ ఎంపీపీ బావండ్ల నాగజ్యోతికృష్ణంరాజు, వైస్ ఎంపీపీ అనిల్‌రెడ్డి, ఇర్రి రమణారెడ్డి, మండల అధ్యక్షుడు చెంద్రారెడ్డి, సర్పంచ్, ఎంపీటీసీల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు సతీశ్‌రెడ్డి, కనకయ్య, నాయకులు చల్లా శ్రీనివాస్‌రెడ్డి, కొండి వెంకట్‌రెడ్డి, నరేందర్, షబ్బీర్, ఫిరోజ్, సిద్దారెడ్డి, కిష్టయ్య, ఆజాం, కోనేటి స్వామి, రాజుగౌడ్, శ్రీశైలం, రాజనర్సు, సిద్ధారెడ్డి, భాస్కర్‌రెడ్డి, నర్సింహులు, మల్లారెడ్డి, మల్లేశం, భాస్కర్, శ్రీధర్, ప్రతాప్ రెడ్డి, వినోద్ తదితరులుపాల్గొన్నారు.



మాట్లాడుతున్న జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

## ఇంటింటికీ వెళ్లి ఆహ్వానించాలి

- సభను విజయవంతం చేయాలి
- మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

గణపురం, ఏప్రిల్24 : హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో ఈ నెల 27న నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు గ్రామాల్లోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలను ఆహ్వానించి విజయవంతం చేయాలని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి శ్రేణులకు పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని బస్వరాజుపల్లి, పరశురాంపల్లి, ధర్మారావుపేట, నగరంపల్లి, కొండాపూర్, సీతారాంపురం గ్రామాల్లో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సన్నాహక సమావేశాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గండ్ర మాట్లాడుతూ సకాలంలో సభాస్థలికి చేరుకొని పార్టీ అధినేత, తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ నాయకత్వాన్ని బలపరిచి అబద్ధాల కాంగ్రెస్ సర్కారుకు బుద్ధి చెప్పాలని, దేశ రాజకీయాల్లో మార్పు తెచ్చే బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. అనంతరం నగరంపల్లి బీజేపీ గ్రామ శాఖ అధ్యక్షుడు పోషణ మహేశ్ బీఆర్ఎస్‌లో చేరగా ఆయనకు గండ్ర గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సమావేశాల్లో మండల పార్టీ అధ్యక్షుడు మోతె కరుణాకర్‌రెడ్డి, భూపాలపల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పోలుసాని లక్ష్మీనరసింహారావు, గణపురం పీఏసీఎస్ మాజీ చైర్మన్ పోరెడ్డి పూర్ణచందర్‌రెడ్డి, మంద అశోక్‌రెడ్డి రామంచ భద్రయ్య, ఉడుత సాంబయ్యాయాదవ్, పేరాల దేవేందర్‌రావు, మార్త సుధాకర్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.



బీఆర్ఎస్‌లో చేరిన వారితో మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

## ముస్తాబవుతున్న ఎడ్లబండ్లు

హసన్‌పర్తి, ఏప్రిల్ 24: బీఆర్ఎస్ రజతోత్సవ సభకు తరలివచ్చేందుకు జనం సన్నద్ధమవుతున్నారు. వర్ధన్నపేట ఇన్‌చార్జి, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పిలుపు మేరకు హసన్‌పర్తి మండలం దేవన్నపేట గ్రామ అధ్యక్షుడు సూధన్ 50 ఎడ్లబండ్లను సిద్ధం చేస్తున్నారు. సూరం వాసుదేవరెడ్డి ఆధ్వర్యంలో ఎడ్లబండ్లకు గులాబీ రంగులు వేసి గులాబీ జెండాలతో ముస్తాబు చేస్తున్నారు. ఈ సందర్భంగా వాసుదేవరెడ్డి మాట్లాడుతూ.. వర్ధన్నపేట నియోజకవర్గంలోనే దేవన్నపేట ఆదర్శంగా ఉండేందుకు 50 ఎడ్లబండ్లు, 500మందితో సభకు వచ్చేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిపారు. వారి వెంట మాజీ సర్పంచ్ చుంచు రవి, పాక్స్ డైరెక్టర్ విజేందర్, బీఆర్ఎస్ కార్యకర్తలు ఉన్నారు.



సభకు వెళ్లేందుకు గులాబీ కలర్ వేసి సిద్ధంగా ఉన్న ఎడ్లబండ్లు



సీపీకి మ్యాప్ ద్వారా వివరిస్తున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, పక్కన మాజీ మంత్రి ఎర్రబెల్లి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

## సభా ప్రాంగణాన్ని పరిశీలించిన సీపీ

ఎల్కతుర్తి, ఏప్రిల్ 24: బీఆర్ఎస్ రజతోత్సవ సభ ప్రాంగణాన్ని గురువారం వరంగల్ పోలీసు కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ పరిశీలించారు. సభలో చేపడుతున్న ఏర్పాట్లు, బారికేడ్లు, హెలీప్యాడ్, వీఐపీ, ఇతరుల వాహనాల పార్కింగ్ రూట్లు, ప్రధాన వేదిక తదితర విషయాలను ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, తక్కళ్లపల్లి రవీందర్‌రావు, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్‌భాస్కర్, పెద్ది సుదర్శన్ రెడ్డి, వొడితెల సతీశ్‌కుమార్, మాజీ ఐపీఎస్ అధికారి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, నాగుర్ల వెంకన్న తదితర నేతలు సీపీకి వివరించారు. ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడితే ప్రత్యామ్నాయ రూట్లతోపాటు అంబులెన్స్‌లను అందుబాటులో ఉంచుకోవాలని సీపీ వారికి సూచించారు. పోలీసులు తమ సహకారాన్ని అందిస్తారని, వలంటీర్లతో కలిసి ట్రాఫిక్ అంతరాయం కలుగకుండా చూస్తామని సీపీ తెలిపినట్లు సమాచారం. సభాస్థలికి సంబంధించిన రూట్‌మ్యాప్‌ను ఆయన పరిశీలించారు. అనంతరం పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఈస్ట్‌జోన్ డీసీపీ అంకిత్, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ జితేందర్‌రెడ్డి, ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ, ఏఆర్ అడిషనల్ ఎస్పీ సురేశ్, ఏఆర్ ఏసీపీ అనంతయ్య, కాజీపేట ఏసీపీ తిరుమల్, డివిజన్ పోలీసు అధికారులు ఉన్నారు.



రజతోత్సవ సభా వేదిక వద్ద తనిఖీలు చేస్తున్న డాగ్ స్క్వాడ్ సిబ్బంది

## పహల్గాం మృతులకు నివాళి




అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న వినయ్ భాస్కర్

కీర్తి స్తూపం వద్ద కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న టీఎన్జీవోలు

జమ్మూ కశ్మీర్ పహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాద దాడిలో మృతిచెందిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని గురువారం రాత్రి బీఆర్ఎస్ యువజన విభాగం ఆధ్వర్యంలో హనుమకొండ బాలసముద్రంలోని పార్టీ కార్యాలయం నుంచి అదాలత్ సెంటర్‌లోని అమరవీరుల స్తూపం వరకు కొవ్వొత్తులతో శాంతి ర్యాలీని నిర్వహించారు. బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్‌తోపాటు పలువురు అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు. అలాగే హనుమకొండ కలెక్టరేట్ నుంచి కీర్తి స్తూపం వరకు టీఎన్జీవోలు పెద్దఎత్తున కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి, అమరులకు నివాళులర్పించారు. టీఎన్జీవో హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్, జిల్లా కార్యదర్శి బైరి సోమయ్య, అసోసియేట్ అధ్యక్షుడు వేణుగోపాల్, కోశాధికారి రాజేశ్, గౌరవ అధ్యక్షుడు శ్యాంసుందర్, కేంద్ర సంఘం నేతలు పాల్గొన్నారు. -హనుమకొండ, ఏప్రిల్ 24